ప్రజాశక్తి
మంగళవారం 25 జులై 2023 5
అనంతపురం



మొహరంను ప్రశాంతంగా జరుపుకోండి

ఎస్పీ కె.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

జిల్లా వ్యాప్తంగా మొహరం వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు కోరారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ వేడుకలను గ్రామాల్లో ప్రశాంతతకు భంగం లేకుండా సోదరభావంతో నిర్వహించుకోవాలన్నారు. అలావ్ తొక్కేప్పుడు భేషజాలకు పోయి గొడవలకు దిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మొహరం పండుగ జరుపుకోవాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరి అన్నారు. పండుగ సందర్భంగా గతంలో గొడవలు జరిగిన గ్రామాల్లో ట్రబుల్ మాంగర్స్‌కు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు అవసరమైతే బైండోవర్ చేస్తామన్నారు. మొహరం పండుగలో కీలక ఘట్టాలైన చిన్నసరిగెత్తు, పెద్ద సరిగెత్తు, జలధి కార్యక్రమాల్లో గ్రామాల్లో పోలీసు నిఘా ఉంటుందని. ఎవరైనా గొడవలకు దిగినా, సమస్యలు సష్టించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తుంగభద్ర వరద నీటిని నిల్వచేయాలి : సిపిఎం



ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఇటీవల కర్నాటక రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో తుంగభద్ర డ్యాంకు నీటి ప్రవాహం పెరుగుతున్నందున దిగువకు వదిలే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో వరద నీటిని జిల్లాలో నిలువ చేసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ అధికారులను కోరింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత రెండు సంవత్సరాల్లో కురిసిన వర్షాల వల్ల తుంగభద్ర డ్యాం నుంచి సుమారు 300 టిఎంసిల నీరు వృథాగా సముద్రంలోకి వదిలేశారన్నారు. ఆ నీటిలో కొంత భాగం జిల్లాలో నిలువ చేసుకుని ఉంటే ఈ సంవత్సరం కొన్ని ప్రాంతాల్లోనైనా సాగు ఆలస్యం కాకుండా ఉండేదన్నారు. హెచ్ఎల్సీ కాల్వ ఆధునీకరణ పనులు నిలిచిపోయాయన్నారు. అత్యధిక కాల్వ పూడికగా మారిందని చెప్పారు. వరద నీటి నిలువ కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని చాలా కాలంగా జిల్లా ప్రజలు నీటి నిపుణులు కోరుతున్నా ప్రభుత్వం నుండి స్పందనలేకపోవడం విచారకరం అన్నారు. ప్రస్తుతం తుంగభద్ర డ్యాంకు పెరుగుతున్న నీటిలో కొంత భాగమైనా జిల్లాలో నిలుపుకునేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇందుకు అవసరమైన నిధులు, సిబ్బందిని కేటాయించేందుకు జిల్లా ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని రాంభూపాల్ డిమాండ్ చేశారు.

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం

అధికారుల పర్యవేక్షణ ఉండాలి - కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



స్పందన అర్జీల పరిష్కారంపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారంలో నాణ్యత మరింత పెంచి వాటికి పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ గాయత్రి దేవి, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, ఆర్డీవో మధుసూదన్, డిప్యూటీ కలెక్టర్ శంకరయ్య, హౌసింగ్ పీడీ కేశవనాయుడు, డీఈవో సాయిరామ్ తదితర శాఖల అధికారులతో కలిసి అర్జీలను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 544 అర్జీలను ప్రజలు అందించారు. అనంతరం స్పందన గ్రీవెన్స్‌పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని మండలాల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమం కింద వస్తున్న స్పందన గ్రీవెన్స్ అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఏఒక్క అర్జీకూడా బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. గడువులోపే అత్యంత నాణ్యతగా అర్జీలకు పరిష్కారం చూపించాలన్నారు. వీటిపై ఆయా శాఖల అధికారుల పర్యవేక్షణ విధిగా ఉండాలని సూచించారు. అర్జీలకు ఎండార్స్మెంట్ ఎలా ఇస్తున్నారు అనేది చూడాలన్నారు. 24 గంటల్లో గడువు పూర్తి అయ్యే అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. రాయదుర్గం, గుత్తి, తాడిపత్రి తదితర అర్బన్ ప్రాంతాల్లో, రాప్తాడు, కనేకల్, తదితర మండలాల పరిధిలో ఎక్కువగా ఈకేవైసీ పెండింగ్ ఉందని, మండల ఆడిట్ టీంలు వెంటనే ఈ కేవైసీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి

సిఐటియు నాయకులు హనుమంతురెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు హనుమంతురెడ్డి

రోజూ పరిసరాలను శుభ్రం చేసే పంచాయతీ కార్మికుల వేతనాలను పెంచాలని సిఐటియు నాయకులు హనుమంతురెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం రూరల్ పరిధిలోని గన్నెవారిపల్లి కాలనీలో నిర్వహించిన పంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా పంచాయతీల్లో సేవలు అందిస్తున్న కార్మికులకు కేవలం రూ.8వేలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. పెరిగిన నిత్యావసర ధరలతో ఈ వేతనాలు ఏమూలకూ చాలడం లేదన్నారు. అదేవిధంగా తాడిపత్రిలో ఉన్న జనాభాలో సగం జనాభా గన్నెవారిపల్లి పంచాయతీలో ఉందన్నారు. జనాభాకు అనుగుణంగా పంచాయతీ కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు అందించే చేతి తొడుగులు, సబ్బులు, నూనె వంటివాటిని అందివ్వడం లేదన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న రాష్ట్రవ్యాప్తంగా ఎంపిడిఓ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో పంచాయతీ కార్మికులతోపాటు ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జగన్ మోహన్‌రెడ్డి, కెవిపిఎ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, పంచాయతీ కార్మికులు రామకృష్ణ, రాజు, ఓబయ్య, సంధ్య, వెంకటసుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మరణం లేని కవి జాషువా

వర్థంతి సభలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

20వ శతాబ్ది తెలుగు కవుల్లో విశిష్ట స్థానం సంపాదించుకుని మరణంలేని కవిగా గుర్రం జాషువా నిలిచిపోయారని డిప్యూటీ మేయర్ కొగటం విజయభాస్కర్‌రెడ్డి కొనియాడారు. జాషువా వర్ధంతిని పురస్కరించుకుని జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని ఆర్ట్స్ కళాశాల ప్రధాన గేటు ముందు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖండకావ్యాల రారాజు జాషువా సమాజంలో మార్పును కోరుకున్న గొప్ప కవి అన్నారు. తన సాహిత్యం ద్వారా సమాజానికి దిశానిర్దేశం చేశారని తెలుగు శాఖ ఆచార్య జి బాలసుబ్రమణ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో జాషువా సాహిత్య పీఠం అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి హెచ్.నాగలింగయ్య, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, మాజీ ప్రిన్సిపాల్ ఎన్.రంగస్వామి, నానీల నాగేంద్ర, పూజారి ఈరన్న, మానవత తరిమెల అమర్నాథ్‌రెడ్డి ఆర్ట్స్ కళాశాల తెలుగు శాఖ అధ్యాపకులు యోగేశ్వరనాయుడు, అంకే శ్రీనివాసులు, అంకే మదన్మోహన్, ప్రజా గాయకుడు దాసరి ఆదినారాయణ, అకాడమీ కన్సల్టెంట్లు నాగేంద్ర, కె.జగదీష్, తన్నీరు నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



కవి గుర్రం జాషువాకు నివాళులర్పిస్తున్న అతిథులు



గం'జాయ్'మత్తు..!

గంజాయి మత్తు యువతను చిత్తు చేస్తోంది. జిల్లాలో గంజాయి సాగు లేనప్పటికీ విశాఖపట్నం ఏజెన్సీ నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లాలోకి వస్తోంది. విశాఖపట్నం, అరకు ప్రాంతాలకు చెందిన కొందరితో సంబంధాలు పెట్టుకుని జిల్లా ప్రాంతం వాసులు గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తున్నారు.

బయట నుంచి తీసుకువచ్చిన గంజాయిని చిన్నచిన్న పాకెట్లలో విక్రయిస్తున్నారు. చిన్న ప్యాకెట్ గంజాయి రూ.వంద వరకూ పలుకుతున్నట్టు సమాచారం. ముఖ్యంగా యువతను లక్ష్యంగా చేసుకుని ఈ గంజాయి విక్రయాలు సాగుతున్నాయి. హిందూపురం కేంద్రంగా గంజాయి ఎగుమతి, దిగుమతి జరుగుతున్నట్లు తెలుస్తోంది.

- హిందూపురం కేంద్రంగా అమ్మకాలు
- ఉమ్మడి అనంత జిల్లాకు సరఫరా
- విశాఖ నుంచి పురానికి దిగుమతి
- యువతే లక్ష్యంగా వ్యాపారాలు

ప్రజాశక్తి-హిందూపురం

చెడు వ్యసనాలకు బానిసైన కొందరు గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నారు. విశాఖ నుంచి హిందూపురానికి గంజాయిని తీసుకొచ్చి అక్కడి నుంచి హిందూపురంతో పాటు అనంతపురంలోని కొన్ని ప్రాంతాలకు, కర్నాటకలోని కొన్ని ప్రాంతాలకు వీటిని తరలిస్తున్నట్లు తెలుస్తోంది. గంజాయి తరలింపులో పురం పారిశ్రామిక వాడలో వివిధ పరిశ్రమల్లో పని చేసే ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. వీరంత ఎవరికీ అనుమానం రాకుండా రైలులో వెళ్లి, అదే రైలులోనే తీసుకొచ్చి రైల్వే స్టేషన్ సమీపంలో దాచి పెట్టి క్రయ విక్రయాలు జరుతున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వీరి నుంచి పట్టణానికి చెందిన కొంద మంది యువకులు కొనుగోలు చేసి సేవించడంతో పాటు ఇతరులకూ అధిక డబ్బులకు విక్రయిస్తున్నారు. గతంలో కర్నాటక మధ్యాన్ని విక్రయించే వారు సైతం అధిక లాభాలు వస్తుండడంతో గంజాయి అమ్మకాలపై దృష్టి సారించారు. పట్టణం నుంచి వేలాది మంది నిత్యం బెంగళూరుతో పాటు ఇతర ప్రాంతాలకు ఉపాది కోసం రాక పోకలు సాగిస్తున్నారు. ఇతర రాష్ట్రాల వారు సైతం పెద్ద ఎత్తున వచ్చి వెళుతున్నారు. ఇలాంటి వారిలో కొందరు ఈ గంజాయి మహమ్మారికి అలవాటు పడి వాటి విక్రయాల ఉచ్చులో పడుతున్నారు. వీరంతా పురం పారిశ్రామిక వాడిలోని కార్మికులతో కలిసి పోతుండడంతో వారిని పోలీసులు గుర్తించడంలో కష్టం అవుతోంది. ఇటీవల గంజాయిపై జిల్లా ఎస్పీ ఉక్కుపాదం మోపడంతో దీనిపై ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ నేపథ్యంలోనే సోమవారం నాడు ఎనిమిది మందిని అరెస్టు చేసి దాదాపు 9 కిలోల గంజాయిని హిందూపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

గంజాయి మత్తులో యువత

యువత గంజాయి మత్తులో తూలుతు పెడదోవ పడుతోంది. ఈ మత్తుకు బానీసలైన వారిలో ఎక్కువ మంది 30 సంవత్సరాలలోపు ఉన్న వారే ఉన్నారు. హిందూపురం ప్రాంతంలో ఖాళీ ప్రదేశాలు, వెంచర్లు వేసిన ప్రాంతాలను స్థావారాలుగా చేసుకుంటున్నారు. గుంపులుగా చేరి గంజాయిగుప్పు గుప్పున పీలుస్తున్నారు. ఈమత్తులోనే నేరాలకూ పాల్పడుతున్నారు. దారిలో ఎవరైన కనిపిస్తే దాడికి దిగుతున్నారు. విద్యార్థినులు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడి నుంచి జిల్లా వ్యాప్తంగా పలు పట్టణాలు, గ్రామాలకు గంజాయి సరఫరా చేస్తున్నారు.

ఇవే అడ్డాలు...

హిందూపురం, మడకశిర, పెనుకొండ, ధర్మవరం, అనంతపురం జిల్లాలోని అనంతపురం తదితర పట్టణాలు మండల కేంద్రాల్లో సైతం గంజాయి లభిస్తున్నట్లు అరోపణలు వినపిస్తున్నాయి. పాన్ సెంటర్లు, డాబాలు, రైల్వే స్టేషన్, ఆర్‌టిసి బస్టాండ్ తదితర ప్రాంతాలను అడ్డగా చేసుకుని వీటిని విక్రయిస్తున్నట్లు సమాచారం. గంజాయి ఎక్కడ దొరుకుతుందో దానికి బానిసలైన యువత వద్ద పక్క సమచారం ఉటుంది. కోడ్ భాషలో యువకులు దీనిని కొనుగోలు చేస్తున్నారు. ఈ మత్తుకు బానిసనైన వారు మరికొందరికి అలవాటు చేస్తున్నారు. గతంలో హిందూపురంలో గంజాయి అంటే ఏమిటో తెలియదు, ప్రస్తుతం కిలోల కొద్ది గంజాయి పట్టుబడుతోంది.

గంజాయి రవాణాపై నిఘా

గంజాయి అక్రమ రవాణా కార్యకలాపాలు నిర్వహించే వారిపై ఉక్కుపాదం మోపేల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఉంచాం. హిందూపురం ప్రాంతలో రవాణ కాకుండా నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశాలు జారీ చేశాం. ఆరోగ్యానికి హాని కలిగించే మత్తు పదార్థాలు, నాటు సారాయి, గంజాయి మొదలగు పదార్థాల నియంత్రణ విషయంలో పూర్తి స్థాయి చర్యలు తీసుకుంటున్నాం. యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోరాదు. గంజాయి విక్రయించే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తాం. ఎక్కడైనా వీటి విక్రయాలు జరుగుతుంటే సంబంధిత ప్రాంతాల ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలి. సమచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం.

డీఎస్పీ కంజాక్షన్.

బిజెపి వైఖరితోనే మణిపూర్‌లో హింస



అనంతపురంలో మౌనప్రదర్శన నిర్వహిస్తున్న పౌరస్పందన నాయకులు

- మారణకాండకు కారకులైన వారిని శిక్షించాలి
- ఇలాంటి ఘటనలతో మానవ, ప్రజాస్వామ్యం హననం
- మౌనప్రదర్శనలో అనంత పౌర స్పందన వేదిక డిమాండ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మణిపూర్ రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర బిజెపి ప్రభుత్వాలు రిజర్వేషన్ల పేరుతో రెండు జాతుల మధ్య ఘర్షణ వాతావరణం సృష్టించడం వల్లే అక్కడ పెద్ద ఎత్తున హింస చెలరేగిందని అనంత పౌర స్పందన వేదిక నాయకులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ తెలిపారు. మణిపూర్‌లో హింస సంఘటనలు నిర్మూలించి శాంతి నెలకొల్పాలని, ఆ రాష్ట్ర ప్రజలకు సంఘీభావంగా అనంత పౌరస్పందన వేదిక ఆధ్వర్యంలో మౌనప్రదర్శన, మానహారంను సోమవారం నిర్వహించారు. నగరంలోని టవర్‌క్లాక్ సర్కిల్ నుంచి మౌనప్రదర్శనగా సప్తగిరి సర్కిల్ వరకు చేపట్టి అక్కడ మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. ఇందులో పెద్ద ఎత్తున విద్యార్థులు, ప్రజాసంఘాల నాయకులు హాజరై మణిపూర్ ప్రజలకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్‌తో పాటు రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శీలా జయరామప్ప, మానవహక్కుల వేదిక ఎస్.ఎం.బాషా, డాక్టర్ వీరభద్రయ్య, సీనియర్ పాత్రికేయులు సుసర్ల రమేష్, విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం జిల్లా కన్వీనర్ ఏజీ.రాజమోహన్, ఎంఎన్‌టి.రాజు, రెడ్స్ భానుజా, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, ప్రజా పరిరక్షణ వేదిక బోస్, పట్టణ పౌర సంఘాల నాయకులు వి.రామిరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ మణిపూర్ సంఘటన మానవ సమాజాన్ని కలిచి వేస్తోందన్నారు. మణిపూర్ రాష్ట్రం అల్లర్లు, దాడులతో అట్టుడికి పోతోందన్నారు. ఇంతటి మారణకాండ జరుగుతున్నా అక్కడి ప్రభుత్వాలు, పోలీసు యంత్రాంగం నియంత్రించడంలో ఘోరంగా విఫలం చెందాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుకి, మెయితి రెండు వర్గాల మధ్య రిజర్వేషన్ సంఘర్షణ వల్ల హింస తలెత్తిందన్నారు. ప్రభుత్వం రిజర్వేషన్ సమస్యను పరిష్కరించకుండా ప్రజల మధ్య చిచ్చుపెట్టే చర్యలను చేపట్టిందన్నారు. దీని వల్లే అక్కడ పెద్ద ఎత్తున హింస చోటు చేసుకుంటోందని చెప్పారు. మహిళలను వివస్త్రలను చేసి నగ్నంగా ఊరేగించి గ్యాంగ్ రేప్ చేయడం, హత్య చేయడం లాంటి ఘటనలు దేశచరిత్రలో మాయని మచ్చగా నిలిచిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్ ఘటన మానవ, ప్రజాస్వామ్యం హననానికి దారి తీశాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ హింసకు కారణమైన ఆ రాష్ట్ర అధికారంలోని బిజెపి ప్రభుత్వాన్ని తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర మహిళా కమిషన్‌నూ బర్తరఫ్ చేయాలన్నారు. పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు లేవనెత్తిన మణిపూర్ ఘటనపై చర్చ జరిగేలా మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అమానవీయమైన సంఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే మణిపూర్‌లో శాంతి నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి ఐఎంఎం.మహబూబ్‌బాషా, జమాతే ఇస్లామీ హింద్ నాయకులు హాజీపీరా, యాసిర్, నవాజ్, ఎంపిజె నాయకులు ముస్తఫా, ఫిరోజ్, ఐవైఎం రహంతుల్లా, శామీర్ సంఘీభావంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్యామల, రాజేశ్వరి, జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, ప్రజారోగ్య వేదిక కన్వీనర్ శ్రీనివాసరావు, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్, శివ, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు వలి, నగర నాయకులు మసూద్, సిఐటియు నాయకులు వెంకటనారాయణ, పట్టణ పౌర సంఘాల నాయకులు ప్రకాష్, జెవివి జిల్లా నాయకులు రామిరెడ్డి, పాత్రికేయులు షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

శ్రీసత్యసాయి తాగునీటి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

1 నుంచి నిరవధిక సమ్మె - కలెక్టర్‌కు సిఐటియు వినతి



కలెక్టర్ ఎమ్.గౌతమికి సమస్యలను వివరిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శ్రీసత్యసాయి శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో కలెక్టర్ ఎం.గౌతమిని కలిసి వచ్చేనెల 1వ తేదీ నుంచి కార్మికుల నిరవదిక సమ్మెలోకి వెళ్తున్నట్లు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా నాగేంద్రకుమార్ మాట్లాడుతూ తాగునీటి పథకంలో 575 మంది కార్మికులు గ్రామాలకు నీరు సరఫరా చేస్తున్నారని తెలిపారు. దీర్ఘకాలికంగా సమస్యలు పరిష్కరించకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. సమస్యలు ముఖ్యమంత్రికి దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం భాగంగా నాలుగు రోజులు సమ్మె నిర్వహించామన్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఇబ్బందులు రాకూడదని కలెక్టర్‌గా చొరవ తీసుకుని మూడు రోజుల్లోనే వేతనాలు చెల్లిస్తామని హామి ఇచ్చారని గుర్తు చేశారు. రూ.32 కోట్ల గ్రాంట్ వస్తుందని మాట ఇచ్చారు, నేటికీ 17 రోజులు గడచినా మాకు ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. తక్షణమే పరిశీలించి వేతనాలు చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే 1వ తేదీ నుంచి నిరవదిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి కార్మికుల యూనియన్ ప్రధాన కార్యదర్శులు తిప్పేస్వామి, శ్రీనివాసులు, ఎస్.రమేష్‌రెడ్డి, రవీంద్రాచారి, నాగరాజు, రామాంజనేయులు, ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బెస్తరపల్లిలో ప్రబలిన విషజ్వరాలు.. వృద్ధురాలి మృతి

ప్రజాశక్తి-కుందుర్పి



చికిత్స పొందుతున్న వృద్ధురాలు గంగమ్మ

మండల పరిధిలోనే బెస్తరపల్లి గ్రామంలో విష జ్వరాలు ప్రబలి ప్రజలు మంచానపడ్డారు. గ్రామంలో పది రోజులుగా డెంగీ, మలేరియా, తదితర జ్వరాలు ప్రబలడంతో ప్రతిరోజూ 10 నుంచి 15 మంది దాకా ఆసుపత్రి పాలవుతున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి వృద్ధురాలు వడ్డే లక్ష్మి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ జ్వరంతో పాటు కామెర్లు రావడంతో మృతిచెందింది. ప్రస్తుతం చిన్నపాటి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో గ్రామంలో ఎక్కడికక్కడ నీరు నిల్వ ఉండడంతో పాటు పారిశుధ్యం పడకేసింది. దీంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. గ్రామంలో వైద్య సిబ్బంది వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నా జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకూ పెరగడం గమనార్హం. రోగులు స్థానికంగా వైద్యం చేయించుకోగా డెంగీ లక్షణాలని తెలియడంతో మెరుగైన వైద్యం కోసం వెంటనే అనంతపురం, కర్నాటకలోని పావగడ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇండోర్ స్టేడియంపై 'కాపు' నిర్లక్ష్యం

కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం



ఇండోర్ స్టేడియం వద్ద కాలవ సెల్ఫీ ఛాలెంజ్

పట్టణంలోని ఇండోర్ స్టేడియం పట్ల ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి చొరవ చూపకపోవడం వల్ల పనులు అర్ధాంతరంగా ఆగి ముళ్లపొదల మయమైందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు ఆరోపించారు. తన 50 వారాల సెల్ఫీ ఛాలెంజ్‌లో భాగంగా కాలవ ఇండోర్ స్టేడియం దుస్థితిపై సోమవారం 15వ సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. నియోజకవర్గంలో క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో టిడిపి ప్రభుత్వం ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేసిందని, అయితే స్థలం సమస్య వల్ల వెంటనే నిర్మాణ పనులను ప్రారంభించలేకపోయామన్నారు. అనంతరం మోడల్ స్కూల్ పక్కన స్టేడియం పనులను ప్రారంభిం చామన్నారు. అయితే పునాదుల దశలోనే ఎన్నికలు రావడం, ఎమ్మెల్యేగా కాపు గెలవడంతో స్టేడియం నిర్మాణం పనులు ముందుకుసాగలేదన్నారు. ప్రతిభావంతులైన గ్రామీణ ప్రాంత యువకులను క్రీడల్లో ప్రోత్సహించడానికి ఇండోర్ స్టేడియం ఎంతగానో దోహదపడుతుందని, ఇకనైనా ఎమ్మెల్యే చొరవ చూపి స్టేడియం నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు : డిఐజి

అనంతపురం క్రైం : నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిఐజి అమ్మిరెడ్డి సూచించారు. సోమవారం నగరంలోని సప్తగిరి సర్కిల్ నుంచి నందినీ హోటల్ వద్ద ఉన్న టర్నింగ్ పాయింట్ వరకూ డిఐజి ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు. టర్నింగ్ పాయింట్ వద్ద ఏమైనా ఇబ్బందులు కలుగుతున్నాయా.. అని వాహనదారులు, దుకాణాల యజమానులను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ కారణంగా ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ఉండేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసాదరెడ్డి, ట్రాఫిక్ సీఐ వెంకటేష్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

బెళుగుప్పలో విషాదం

అప్పుల బాధతో తండ్రీ కొడుకుల ఆత్మహత్య
మిన్నంటిన కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు





మృతిచెందిన రామ్మూర్తి, సాయికుమార్, రోధిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-బెళుగుప్ప

పప్పుశనగ వ్యాపారంలో పెద్దఎత్తున నష్టం రావడంతోపాటు వ్యవసాయ తోటల్లో సాల్వ్ చేసిన పంటలకు పెట్టుబడులు కూడా రాకపోవడంతో తండ్రీ, కొడుకులు ఆత్మహత్య చేసుకోవడంతో బెళుగుప్పలో విషాదఛాయలు అలుముకున్నాయి. పప్పుశనగ వ్యాపారి ఎం.రామ్మూర్తి (66), కుమారుడు ఎం.సాయికుమార్ (40) అప్పుల బాధ తాళలేక వజ్రకరూరు మండలం గంజిగుంట గ్రామ సమీపంలో శీతల పానీయంలో విషపు గుళికలు వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం సోమవారం మృతదేహాలను బెళుగుప్పలోని స్వగృహానికి తరలించారు. దీంతో ఒక్కసారిగా బెళుగుప్పలో గంభీర వాతావరణం నెలకొంది. మృతదేహాలను చూడగానే భార్యా, పిల్లలు బోరున విలపించారు. వారు విలపిస్తున్న తీరు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. మృతదేహాలను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు.

మహిళలపై దాడులను అరికట్టాలి



పోరుయాత్ర పోస్టర్లను విడుదల చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-పుట్లూరు

మహిళలపై దాడులు, అత్యాచారాలను అరికట్టాలని సిపిఎం, ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28 నుంచి చేపట్టనున్న మహిళల పోరుయాత్రకు సంబంధించిన పోస్టర్లను సోమవారం మండలంలోని ఓబులాపురం గ్రామంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మహిళా సంఘం నాయకులు మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలోనూ రోజురోజుకూ మహిళలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. మహిళల భద్రత కోసం ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే హిందూపురం, శ్రీకాకుళం నుంచి బస్సుయాత్రలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఈయాత్రలు ఆగస్టు 8న అమరావతికి చేరుకుని బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహిళా సంఘం కార్యదర్శి టి.రేణుక, సిపిఎం మండల కార్యదర్శి ఎస్.సూరి, సహాయ కార్యదర్శి జి.వెంకటచౌదరి, భాస్కర్‌రెడ్డి, టి.పెద్దయ్య, నాగభూషణం, లక్ష్మీదేవి, అంజినమ్మ, సరస్వతి, కళ, దేవి, ఎస్.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : మణిపూర్‌లో జరిగిన మారణ హోమానికి, అమానవీయ ఘటనలకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బాధ్యత వహించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనలను నిరసిస్తూ సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు జగ్గలి రమేష్ అధ్యక్షతన వివిధ ప్రజాసంఘాలు, మేధావులు మైనారిటీ, దళిత, గిరిజన సంఘాలు, పట్టణ పౌరుల స్పందన వేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ప్రిన్సిపల్ ఆర్కే నాయుడు మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగిన మారణహోమాన్ని ముక్తకంఠంతో ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి ఘటనలను మానవతా కోణంలో ప్రతి పౌరుడూ ఖండించాలన్నారు. అంతేగాకుండా ఆయా ఘటనలపై పార్లమెంట్‌లో చర్చించి నిందితులు కఠినంగా శిక్షించి అల్లర్లను అణచివేయాలని సూచించారు. లేకుంటే రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. ఆయా ఘటనలకు వ్యతిరేకంగా ఈనెల 26న పట్టణంలోని బీరప్ప గుడి సర్కిల్ నుంచి గాంధీ విగ్రహం వరకూ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు ఆలం నవాజ్, మహేంద్ర, లాయర్ కోరి చంద్రశేఖర్, భీమలింగ, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతిచెందిన యల్లప్ప

కణేకల్లు : మండల పరిధిలోని నల్లంపల్లి గ్రామ సమీపంలో బసయ్య తోట వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎరుకుల యల్లప్ప(35) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆలూరు వద్ద నివాసం ఉంటున్న ఎల్లప్ప తన సోదరుడైన నాగరాజుతో కలిసి ద్విచక్ర వాహనంపై రాయదుర్గం వెళ్లాడు. అక్కడ పని ముగించుకున్న వారు తిరిగి సొంత ఊరికి బయల్దేరారు. అయితే మార్గమధ్యలో బసయ్య తోట వద్ద అదుపుతప్పి కిలోమీటర్ రాయిని ఢీకొనడంతో యల్లప్ప అక్కడికక్కడే మృతి చెందగా నాగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలిసిన వెంటనే మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైతుకు పాముకాటు

గుత్తి : మండలంలోని ఎంగిలికొండ గ్రామానికి చెందిన రైతు కంబయ్య ఆదివారం రాత్రి పాముకాటు గురయ్యాడు. కంబయ్య ఇంటి ముందర కూర్చొని ఉండగా పాము కాటు వేసింది. దీంతో కుటుంబ సభ్యులు అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అదనపు చికిత్స కోసం అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

జూదరుల అరెస్టు

అనంతపురం క్రైం : స్థానిక ప్రశాంతినగర్‌లో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు 4వ పట్టణ సీఐ ఆర్.ప్రతాపరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడులు చేసి నగరానికి చెందిన ఎస్.కృష్ణ, ఆర్.రామకృష్ణారెడ్డి, ఎ.సూర్యనారాయణ, కె.హనుమంతు, రాప్తాడు మండలానికి చెందిన రఘునాథరెడ్డి, కె.రామకృష్ణను అరెస్టు చేసి రూ.28,300 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు చంద్రశేఖర్, గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు

తాడిపత్రి : తాడిపత్రి పట్టణంలో 17 మంది మట్కా నిర్వాహకులను అరెస్టు చేసినట్లు సిఐ అమీద్‌ఖాన్ తెలిపారు. ఈమేరకు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పక్కాగా అందిన సమాచారంతో పట్టణంలోని నందలపాడు ఫ్లైఓవర్ వద్ద నలుగురు, టైలర్స్ కాలనీలో 13 మంది మట్కా నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ.20,19,490 నగదు, ఓ షిఫ్ట్ కారును, 14 సెల్‌ఫోన్లు, 1 ట్యాబ్, మట్కా చీటీలు, 17 పెన్నులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రయివేటు పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు అందజేయాలి

ఆర్‌జెడికి అపుస్మా నేతల వినతి



ఆర్‌జెడికి వినతిపత్రం సమర్పిస్తున్న ఆపుస్మా నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రవేట్ పాఠశాలలకు ఇండెట్ ప్రకారం ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను సకాలంలో అందజేయాలని రాష్ట్ర అన్ ఎయిడెడ్ ప్రయివేట్ పాఠశాలల యాజమాన్య సంఘం జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శి కుసుమ పుల్లారెడ్డి, గాజుల చంద్ర కోరారు. ఈమేరకు నగరంలోని టిటిడిసి సెంటర్‌లో నిర్వహిస్తున్న పాఠశాలల లీడర్స్‌ట్రైనింగ్ కార్యక్రమానికి విచ్చేసిన కడప రీజియన్ విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ వెంకట కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడేళ్ల కాలం రెన్యువల్ ఆఫ్ రికగ్నేషన్ సమయంలో దరఖాస్తు చేసుకున్న స్కూల్స్ ఫైల్స్ అన్నిజీవోల ప్రకారం పత్రాలు సరిగా ఉంటే ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రస్తుత జీవో ప్రకారం 8ఏళ్లకు గుర్తింపు ఇవ్వాలని కోరారు. అలాగే ప్రభుత్వ పుస్తకాలను సబ్జెక్టుల వారీగా వెంటనే అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అపుస్మా అధ్యక్షులు కుసుమ పుల్లారెడ్డి, సెక్రటరీ గాజుల చంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి, నగర అధ్యక్షులు శ్రీనాథ్, ట్రెజరర్ అన్వర్‌బాషా, నార్పల సంజీవరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, అంజనరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

27న మున్సిపల్ కార్యాలయం ముట్టడి

కమిషనర్‌తో సిఐటియు నాయకులు...



కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్పొరేషన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27న మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు మున్సిపల్ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సిఐటియు ఆధ్వర్యంలో కమిషనర్ భాగ్యలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు 20ఏళ్లకుపైగా పనిచేస్తున్నా నేటికీ వారి జీతం నుంచి కటింగ్ అయినా ఇపిఎఫ్ సౌకర్యం కల్పించిన పాపానపోలేదన్నారు. ఇక ఇపిఎఫ్ కార్మికులకు డెత్ బెనిఫిట్స్ ఇప్పించకుండా కార్మిక కుటుంబాలను వేధిస్తున్నారన్నారు. కార్మికులకు సరెండర్ లీవ్ రెండు సంవత్సరాలు బకాయి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులని పర్మినెంట్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం ఇస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఈనెల 27న మున్సిపల్ ఇంజినీరింగ్ పారిశుధ్యం కార్మికుల విధులు ఆపి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు కమిషనర్‌కు వివరించారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, మున్సిపల్ యూనియన్ జిల్లా కోశాధికారి ఆదినారాయణ, మున్సిపల్ నగర అధ్యక్ష, కార్యదర్శులు బండారు ఎర్రిస్వామి, సాకే తిరుమలేష్, కుమార్, రవి, రాఘవ, ఇంజినీరింగ్ విభాగం నాయకులు ఓబుళపతి, మురళి, రాయుడు, లక్ష్మీనరసమ్మ, సుధారాణి, సురేష్, తదితరులు పాల్గొన్నారు

బాధితురాలికి ఆర్థికసాయం

తాడిపత్రి : లివర్ సమస్యతో బాధపడుతున్నపట్టణంలోని పప్పూరు రోడ్డులో ఉన్న సాయిబాబా గుడి దగ్గర నల్లబండల ఫ్యాక్టరీలో పని చేస్తున్న రేష్మాబీ, వలి దంపతుల కుమార్తె రేష్మికకు ఉమ్మడి గురుప్రసాద్ సేవా ట్రస్టు ఛైర్మన్ ఉమ్మడి గురుప్రసాద్‌రెడ్డి సోమవారం ఆర్థికసాయం అందజేశారు. గురుప్రసాద్ కుమారుడు జితేంద్రరెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని బాధితురాలి ఇంటి వద్దకు వెళ్లి రూ.5వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ, జేసీబీ రాజగోపాల్, ఉమ్మడి అశ్విత, వరప్రసాద్, వెన్నపూస అమర్‌నాథ్‌రెడ్డి, రవిశంకర్, మాబువలి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం



అన్నదానం చేస్తున్న నిత్యసురభి ట్రస్టు సభ్యులు

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సోమవారం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలమురళి మాట్లాడుతూ ట్రస్టు సభ్యులు హనుమంతురెడ్డి, రామ్మోహన్‌రెడ్డి తండ్రి రామచంద్రారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కవిన్ ఆదిత్య, లక్ష్మి, సాయి, నీలిమ, సుబ్రమణ్యం, ఓబుళపతి, కిష్టప్ప, చంద్రశేఖర్, నబిరసూల్, సుబ్బారావు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప ఇఒఆర్‌డిగా గూడెన్న



ఇఒఆర్‌డి గూడెన్న

బెళుగుప్ప : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నూతన ఇఒఆర్‌డిగా గూడెన్న సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఇఒఆర్‌డి బదిలీపై వెళ్లడంతో కణేకల్ మండలంలో పని చేస్తున్న గూడెన్నను ఇక్కడిని నియమించారు. దీంతో బాధ్యతలు స్వీకరించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేస్తామని తెలిపారు.

నేడు తాగునీటి సరఫరాలో అంతరాయం

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని వాటర్ ట్యాంకులకు పైపులైన్ ఇంటర్ కనెక్షన్లు ఇచ్చే పనులు చేపట్టనున్న దృష్ట్యా మంగళవారం తాగునీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని సూపరింటెండెంట్ ఇంజినీర్ సతీష్‌చంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ సాయంత్రం తాగునీటి సరఫరా చేసే కాలనీలకు అంతరాయం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు

మహిళలు స్వయంశక్తితో ఎదగాలి

బుక్కరాయసముద్రం : ప్రతి మహిళా స్వయంశక్తితో ఎదగాలని ఎంపిపి దాసరి సునీత, జడ్పిటిసి భాస్కర్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీ చైతన్య మండల సమైక్యలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మహిళా రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకఉకుని ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చైతన్య మండల మహిళా సమైక్య అధ్యక్షురాలిగా సుహాసిని, కార్యదర్శిగా మాధవి, కోశాధికారిగా విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా అరుణ, ఉప కార్యదర్శిగా నాగలక్ష్మిను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం మద్దిలేటి, మండల సమైక్య ఓబీలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

బుక్కరాయసముద్రం : మండలంలోని కొర్రపాడు వద్ద ఉన్న గురుకుల ప్రాథమికోన్నత పాఠశాలలో దిశా యాప్, పోక్సో చట్టాలపై సిఐ నాగార్జునరెడ్డి సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో జరుగుతున్న ఆకృత్యాల నేపథ్యంలో ప్రతి బాలికా తమకు తాము రక్షించుకునే విధంగా అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. అలాగే ధృడ సంకల్పంతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ కుటుంబానికి బీమా పంపిణీ

గుత్తి : విధి నిర్వహణలో మరణించిన ఆర్టీసీ డ్రైవర్ కుటుంబానికి అధికారులు సోమవారం బీమా సొమ్మును అందజేశారు. గుత్తి ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ ఆర్.రవి ఇటీవల మృతి చెందాడు. దీంతో ఇడిఎల్ ఐఎఫ్ బీమా కింద మంజూరైన రూ.5,72,307 బీమా సొమ్మును భార్య ఆర్.కమలమ్మకు కార్యాలయ సూపరింటెండెంట్ అవధాని శ్రీపాద అందజేశారు.

హెచ్‌ఎల్‌సిని ఆధునీకరించాలి

బుక్కరాయసముద్రం : హెచ్ఎల్‌సి కెనాల్‌ను ఆధునీకరించి జిల్లా ప్రజానీకానికి తాగు, సాగునీరు అందించాలని జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు అంకే ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని హెచ్ఎల్‌సి కెనాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగువ ప్రాంతంలో కర్ణాటక ప్రభుత్వం ఆధునీకరణ పనులు పూర్తి చేయగా రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వెంటనే హెచ్‌ఎల్‌సిని ఆధునీకరించి ప్రజలకు సాగు, తాగు నీరు అందించాని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి అవుకు విజయ్‌కుమార్, ముప్పూరి క్రిష్ణ, అనంతపురం నగర ఉపాధ్యక్షులు జెక్కిరెడ్డి ఆదినారాయణ, కార్యదర్శి హరీష్, రాప్తాడు మండలం అధ్యక్షులు రామాంజి, పవనిజం రాజు, వెంకటేశు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల వేలం

గార్లదిన్నె : వివిధ కేసుల్లో పట్టుబడిన 14 ద్విచక్ర వాహనాలను సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో సెబ్ సీఐ హసీనాభాను ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. ఈ వేలంలో రూ.2లక్షల ఆదాయం సమకూరినట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ ఖాదర్‌బాషా, నాగేష్, నాగరాజు పాల్గొన్నారు.

అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధమా?
కాలవకు మార్కెట్ యార్డు ఛైర్మన్ భోజరాజు సవాల్

డి.హీరేహాల్ : నాపై చేస్తున్న ఆరోపణలకు, నీవు మంత్రిగా ఉన్నప్పుడు జరిగిన దందాలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని మార్కెట్ యార్డు ఛైర్మన్ భోజరాజునాయక్ టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులుకు సవాల్ చేశారు. డి.హీరేహాల్‌లోని ఇబ్రహీంసాబ్ నివాసంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలో మంత్రిగా చేసిన కాలవ దళితులకు ఎలాంటి పదవులు ఇప్పించలేదని విమర్శించారు. ఎస్టీ కులానికి చెందిన తనకు ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పదవి ఇప్పించగా, ఓర్వలేని కాలవ కక్ష గట్టి అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇక్కడ నాయకులంతా ఓ కుటుంబంలా ఉంటాం. కేవలం ఎన్నికల సమయంలో ఎవరికీ నచ్చిన పార్టీలకు వారు పని చేస్తారు. ఆ తర్వాత అందరం కలిసి కట్టుగా ఉంటామన్నారు. నీవు వచ్చి ఒకరి మధ్య ఒకరికి చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తే ఊరుకో మని హెచ్చరించారు. సమావేశాలు పెట్టి నీ పార్టీ కార్యకర్తలు, నాయకులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం మంచిది కాదని హితవు పలికారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ వన్నూరుస్వామి, సర్పంచులు శ్రీనివాస్‌రెడ్డి, బోయ మల్లికార్జున, కళ్లెం నాగరాజు, నాయకులు హనుమంతరెడ్డి, తొండే వెంకటేష్, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'నాడు-నేడు'తో మారుతున్న పాఠశాలల రూపురేఖలు



పాఠశాలలో టివిని పరిశీలిస్తున్న మేయర్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

పాఠశాలల రూపురేఖలు మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం చేపట్టిందని మేయర్ మహమ్మద్ వసీం తెలిపారు. సోమవారం నగరంలోని పొట్టి శ్రీరాములు పాఠశాలలో నాడు నేడు కింద చేపట్టిన పనులను మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ నాడు-నేడు కార్యక్రమం ద్వారా పొట్టి శ్రీరాములు పాఠశాలకు రూ.1.40 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయభాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, అనిల్‌కుమార్‌రెడ్డి, కమల్‌భూషణ్, డిఇలు చంద్రశేఖర్, ద్రాక్షాయని, ఎఇ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాలి
శ్రీ బాలాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ పల్లె కృష్ణకిషోర్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లె కృష్ణకిషోర్‌రెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

విద్యార్థులు నైపుణ్యతను పెంపొందించుకోవాలని శ్రీబాలాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ పల్లె కృష్ణకిషోర్‌రెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో సీనియర్, జూనియర్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్యత వల్ల ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీఈవో ఎ.శ్రీరాములు, ప్రిన్సిపాల్ సి.వెంకటేశ్వర్లురెడ్డి, పీఆర్ఆర్ ఎంబిఎ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

నార్పల : మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆర్‌డిటి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఆర్‌డిటి వ్యవస్థాపకులు విన్సెంట్ ఫెర్రర్ జ్ఞాపకార్థం ప్రతి విద్యార్థి ఒక మొక్కను దత్తత తీసుకుని పరిరక్షించాలని పిలునిచ్చారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ డైరెక్టర్ నారాయణరెడ్డి, సెక్టార్ టీం లీడర్ నరసింహులు, గొల్లపల్లి సర్పంచి రామాంజనేయులు, ఆర్‌డిటి ఉద్యోగులు, అశోక్, కిషోర్, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

తాడిపత్రి రూరల్ : రూరల్ పరిధిలోని గన్నెవారిపల్లి వద్ద నిర్మిస్తున్న టిడ్కో ఇళ్ల సముదాయాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సోమవారం టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి గుత్తేదారులతో చర్చించారు. ఇందులో భాగంగా మౌలిక సదుపాయాల పనుల పురోగతి, పెండింగ్ పనులు, ఎస్టీపీల నిర్మాణాలపై అధికారులు, గుత్తేదారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రధానంగా మౌలిక సదుపాయాలకు సంబంధించి రోడ్ల నిర్మాణం, పైపులైన్లు, విద్యుదీకరణ పనులు చేపట్టాలన్నారు. వేగంగా పనులు పూర్తి చేస్తేనే సకాలంలో గృహాలను లబ్ధిదారులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నగరూరు బ్రహ్మానందరెడ్డి, టిడ్కో గృహాల గుత్తేదారులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE: GOOTY

INSOLVENCY PETITION No.15/2023

BETWEEN:
Manjula Ravi ...PETITIONER
AND
C.Raghu Rami Reddy and 5 others ...RESPONDENTS

NOTICE TO RESPONDENT NO.1 to No.6

TO

R1: C.Raghu Rami Reddy, S/o Narayana Reddy, Money Lending Business, R/o D.No.1/88, Kaveti Samudram Village, Tadipatri Mandal.
R2: Pachipala Gangaiah, S/o Ganganna, Business, R/o D.No.1/176, Gangadevipalli Village, Tadipatri Mandal.
R3: A.Mallikarjuna, S/o Venkata Naidu, R/o D.No.2/22, Money Lending Business, Akkannapalli Village, Tadipatri Mandal, Ananthapuramu Dist.
R4: Kommeru Dhanalakshmi, W/o Late Ramanjineyulu, Hotel Business, R/o D.No.2/96, Ramapuram Village, Pulivendula Mandal, YSR Kadapa Dist.
R5: Manjula Veeramma, W/o Ramudu, Business, R/o D.No.3/28, Gannevaripalli Village, Tadipatri Mandal, Ananthapuramu Dist.
R6: Dabbara Surya Prakash Naidu, S/o Chinna Babu, R/o D.No.4/178, Srinivasapuram Village, Tadipatri Mandal, Ananthapuramu Dist.

పై అర్జీదారుడు మీ పై అర్జీని దాఖలు చేసి తనను అప్పులు చెల్లించ శక్తి లేని వాడుగా తీర్మానము చేయమని పై కోర్టు వారిని కోరినందున సదరు కోర్టు వారు పై అర్జీని 23-08-2023 వ తేదికి వాయిదా వేసినారు. కావున మీకు ఏమైనా ఆక్షేపణలున్న యెడల మీరు 23-08-2023 వ తేదిన ఉదయం 10.30 గం॥లకు పై కోర్టు యెదుట హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలయును. లేనంతట పై అర్జీని మీ పరోక్షము నందు తీర్మానించబడునని ఇందుమూలంగా తెలుపడమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

R.V.CHALAPATHI
Advocate for the Petitioner
Gooty.

గూగూడులో భద్రత ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని గూగుడులో వెలసిన కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా భద్రత ఏర్పాట్లను డీఎస్పీ వెంకటశివారెడ్డి సోమవారం పరిశీలించారు. ముందుగా స్థానిక ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డితో కలిసి మండల కేంద్రంలోని కూతలేరు వంక మలుపుల వద్ద ప్రత్యేకంగా పోలీస్ పాయింట్ ఏర్పాటు చేయించారు. అదేవిధంగా గాంధీ సర్కిలు, సుల్తాన్‌పేట మలుపు, నార్పల క్రాసింగ్‌లో పోలీసులను నియమించారు. అలాగే హెచ్‌ఎల్‌సి కెనాల్ నుంచి గూగూడు వరకూ భారీ వాహనాలకు డ్రైవర్షన్ పాయింట్ ఏర్పాటు చేవారు. ఇకపోతే ఉత్సవాల్లో దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా మహిళా భక్తుల పట్ల ఎవరైనా ఆకతాయిలు అసభ్యంగా ప్రవర్తిస్తే దగ్గరలోని పోలీసులకుగానీ, 100కుగానీ ఫోన్ చేసి చెప్పాలని కోరారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి



చిన్నారులకు కిట్లు అందజేస్తున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్

ప్రజాశక్తి-గుంతకల్లు

మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు ఉన్న చిన్నారులను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి, శ్రీదేవి సూచించారు. సోమవారం పట్టణంలోని బెంచికొట్టాల, బిటి పక్కీరప్ప కాలనీల్లో ఆయా వార్డుల కౌన్సిలర్లు విద్యారాణి, మేహరున్ బేగం ఆధ్వర్యంలో విడివిడిగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో చిన్నారులకు ఫ్రీ స్కూల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కాన్వెంట్లకు ధీటుగా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తోందన్నారు. కావున తల్లిదండ్రులు అంగన్‌వాడీల్లో చిన్నారులను చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంఎస్‌కె లక్ష్మీదేవి, డాక్టర్ జ్యోత్స్నదేవి, ఎఎన్ఎం పద్మావతి, హెచ్ఎం రమేష్, ప్రోగ్రాం కన్వీనర్ సత్తార్‌బీ, గృహసారథి హాజీరాబేగం, అంగన్‌వాడీ వర్కర్ మేరీ, సహాయకురాలు సత్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నూతన పీర్లచావిడి ప్రారంభం



పీర్లచావిడిని ప్రారంభిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-కణేకల్లు

కణేకల్లులో రూ. 16 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన పీర్లచావిడిని సోమవారం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కాపు మాట్లాడుతూ పెద్ద దేవర కుటుంబీకుల చొరవతో గ్రామస్తులు ఐక్యమత్యంగా నూతన భవనం నిర్మించడం అభినందనీయమన్నారు. ప్రారంభోత్సవానికి వచ్చిన ప్రజలకు అన్నదాన కార్యక్రమం చేపట్టిన స్పేర్ పార్ట్స్ గౌడను కాపు అభినందించారు. కార్యక్రమంలో పెద్ద దేవర హమీద్‌సాబ్, మహబూబ్ పీరా, నజీర్, ఇబ్రహీం, టోపీ ఖాజా, జడ్పిటిసి పద్మావతి, వైసిపి టౌన్ కన్వీనర్ కేశవరెడ్డి, సొసైటీ అధ్యక్షులు తిమ్మప్ప, మారెన్న, వార్డు మెంబర్ హనుమంతరావు , తదితరులు పాల్గొన్నారు

పండ్లతోటల పరిశీలన

ప్రజాశక్తి-కుందుర్పి

ఉపాధి హామీ చట్టం ద్వారా హార్టికల్చర్ రైతులు అన్ని విధాలుగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపిడిఒ వెంకటనాయుడు పేర్కొన్నారు. కుందుర్పి రైతు కెపి గోపాల్ తన ఐదెకరాల పొలంలో సాగు చేసిన పండ్ల తోటల పెంపకాన్ని సోమవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ అర్హత కలిగిన రైతులకు ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం ద్వారా మొక్కలు నాటుకు నేందుకు అవకాశం కల్పిస్తుందన్నారు. అలాగే మొక్కల సంరక్షణ కోసం విడతల వారీగా రైతు ఖాతాలోకి నగదు జమ చేస్తుందన్నారు. ప్రతి రైతు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని పండ్ల తోటల సాగుపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వెంట ఎపిఒ పరంధామ, ఫీల్డ్ అసిస్టెంట్ ముకుంద, రైతులు ఉన్నారు.

టిడిపి కార్యకర్తకు పరామర్శ

పుట్లూరు : మండలంలోని కుమ్మనమల గ్రామానికి చెందిన అనంతపురం పార్లమెంట్ బిసి సెల్ కార్యదర్శి హెచ్.ఓబన్నను టిడిపి నాయకులు సోమవారం పరామర్శించారు. ఓబన్న కడుపునొప్పితో బాధపడుతూ కర్నూలు ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకున్నాడు. విషయం తెలుసుకున్న టిడిపి జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు, ఆదినారాయణరెడ్డి, లక్ష్మయ్య తదితరులు ఓబన్న ఇంటికి వెళ్లి పరామర్శించారు.

'జగనన్న సురక్ష'తో ప్రజల వద్దకే సేవలు

ఉరవకొండ : సిఎం జగన్ తీసుకొచ్చిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల ఇళ్ల వద్దకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నామని ఎంపిపి చంద్రమ్మ, జడ్పిటిసి పార్వతమ్మ, ఎంపిడిఒ వరలక్ష్మి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని వెలుగొండ గ్రామంలో సర్పంచి వీరాంజనేయులు ఆధ్వర్యంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దరఖాస్తు చేసుకున్న పలువురికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపిపి నరసింహులు, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోవిందు, మాజీ జడ్పిటిసి తిప్పయ్య, సర్పంచులు రామాంజనేయులు, శ్రీరాములు, వైసిపి నాయకులు నాగన్న, తేజోనాథ్, అశోక్‌కుమార్, ఎంఎల్ఒ ఓబులేసు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, వాలంటీర్లు, వార్డు సభ్యులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మొహరం వేడుకలు

ఆత్మకూరు : మండల వ్యాప్తంగా మొహర్రం వేడుకలు ప్రశాంతంగా సాగుతున్నాయి. ముఖ్యంగా ఆత్మకూరు, సనప, గొరిదిండ్ల, సింగంపల్లి, పి.యాలేరు, ముట్టాల గ్రామాల్లో పెద్దఎత్తున మొహర్రం వేడుకలు నిర్వహిస్తారు. ఆయా గ్రామాల ప్రజలు మతసామరస్యంతో, ప్రశాంతంగా వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో చెట్లు నరకకూడదన్నారు.

పిఎం కిసాన్‌కు ఇకెవైసి చేయించుకోండి

శింగనమల : పిఎం కిసాన్ కోసం రైతులు తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని ఎఒ అన్వేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం వరకూ ఇకెవైసి చేయనున్నట్లు తెలిపారు. కావున మండలంలో పెండింగ్‌లో ఉన్న రైతులు ఇకెవైసి చేయించుకోవాలని కోరారు.